

విద్యతోనే విజ్ఞానం, వికాసం

విద్యతోనే విజ్ఞానం, వికాసమని, ప్రపంచ తత్వవేత్తల్లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేడ్కర్ ఒకరని కేయూ వీసీ రమేశ్ అన్నారు.

- 8లో▸



పరకాల కాంగ్రెస్‌లో వర్గపోరు

పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో కాంగ్రెస్ వర్గపోరు బట్టబయలైంది. ఎమ్మెల్యే రేవూరి, కొండా వర్గీయుల గొడవ జరిగింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
39^0 /25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

‘ఏపీ సీఎంపై దాడిని ఖండిస్తున్నాం’



బచ్చన్నపేట: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్ష పార్టీ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ నాయకుడు, జగన్‌మోహన్‌రెడ్డి వీరాభిమాని బొడ్డు ప్రవీణ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రాలో సీఎం జగన్‌కు ఎన్నికల ప్రచారానికి వెళ్తుంటే అడుగడుగున నీరాజనాలు పడుతున్నారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి రెండో సారి సీఎం అవుతాడని ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. టీడీపీ నాయకులు దొంగతనంగా రాళ్ల దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్ని కుట్రలు చేసిన జగన్ రెండో సారి సీఎం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, వేణు, ఉపేందర్, మహేష్, ప్రవీణ్, శాంతి పలువురు పాల్గొన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగ వ్యవస్థ



స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థ ప్రమాదకరంగా మారుతుందని, మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీపాన అంబేడ్కర్ సెంటర్ వద్ద ఆదివారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కడియం హాజరై మాట్లాడారు. బీజేపీ నేతలు కులవ్యవస్థను, మత విద్వేషాలను రెచ్చగొడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కందుల రేఖ, కాంగ్రెస్ నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్.నరేందర్‌రెడ్డి, నీల గట్టయ్య, దూదిపాల నరేందర్‌రెడ్డి, గుజ్జరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

చర్చకు సిద్ధమా..!

- భూ కబ్జాలు, ఆక్రమణలు ముత్తిరెడ్డికే సొంతం
- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకురాలు ప్రేమలతారెడ్డి



జనగామ: చీటకోడూరు గ్రామంలో దళితులకు చెందిన భూమిని లాక్కున్నానని తనపై చేసిన ఆరోపణలకు కట్టుబడి పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్దకు దమ్ముంటే చర్చకు రావాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకురాలు ప్రేమలతారెడ్డి మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి సవాల్ విసిరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చీటకోడూరు గ్రామంలోని తన సొంత పొలం మీదుగా రోడ్డు ఉందని మాజీ ఎమ్మెల్యే సీపీఎఫ్ నిధులతో 33 ఫీట్ల రోడ్డు వేసే ప్రయత్నం చేశాడన్నారు. ఈ విషయం తన భర్త చనిపోయిన సమయంలో 10వ రోజు ఇంటికి వచ్చి పరామర్శించాల్సింది పోయి, రోడ్డు ప్రస్తావన తీసినట్లు స్పష్టం చేశారు. గ్రామంలో దళితులకు చెందిన భూమిని తాను లాక్కున్నట్లు ఆరోపించిన ముత్తిరెడ్డి నిజం నిరూపించాలన్నారు. తన పసుపు కుంకుమల కింద వచ్చిన ఐదు ఎకరాల భూమిని ఇంటి స్థలాల కోసం దానం చేసిన గొప్ప కుటుంబం మాదన్నారు. నీ జీవితంలో భూ కబ్జాలు, చెరువుల ఆక్రమణలు, బెదిరింపులు, దందాలు తప్ప, ఎక్కడానైన సాయం చేసిన సందర్భం ఉందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం మంది భూములను ఎలా లాక్కోవాలని పన్నాగాలు పన్నావే తప్ప, అభివృద్ధిపై ఏనాడైనా దృష్టి సారించావా అని దుయ్యబట్టారు. కడుపున పుట్టిన బిడ్డనే తండ్రి చేస్తున్న అరాచకాలపై దుమ్మెత్తి పోసినా, ముత్తిరెడ్డి మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై త్వరలోనే అధినేత కేసీఆర్ వద్దకు వెళ్లి వివరిస్తామన్నారు. ముత్తిరెడ్డి తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని, ఆయనకు దమ్ముంటే అంబేడ్కర్ విగ్రహం వద్దకు రావాలని సవాల్ విసిరారు. ఒక వేళ రాకున్నా నిజం తేలే వరకు ఆయనను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

నష్టపరిహారం ఏది?

- ఏడాదైనా అందని పంట పరిహారం
- లెక్కతేలిన మొత్తం రూ.36.69 కోట్లు
- నేడూ..రేపూ అంటూ కాలయాపన
- అన్నదాతలకు కలిసిరాని యాసంగి



నేలకొరిగిన వరిపంట (ఫైల్)



నేలరాలిన మామిడి కాయలు (ఫైల్)



కొనుగోలు సెంటర్లలో కొట్టుకుపోతున్న ధాన్యం గింజలు (ఫైల్)

జనగామ: యాసంగి సీజన్ అన్నదాతలకు కలిసి రావడం లేదు. వడగళ్ల వర్షం.. మరోవైపు అథఃపాతాళానికి చేరుకుంటున్న భూగర్భ జలాలతో పంటలకు సాగునీరు అందించలేని దయనీయ పరిస్థితులు. దీంతో వేలాది ఎకరాల్లో ఎండుతున్న పంటలకు తోడు.. గత ఏడాది ఇదే సీజన్‌లో ప్రకృతి వైపరీత్యంతో దెబ్బతిన్న పంట నష్టపరిహారం నేటికి అందక పోవడంతో... రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పరిహారం మంజూరయింది. ట్రెజరీలో ఉందంటూ గత ఏడాది వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించినా... నేటికి మోక్షం కలగడం లేదు. ప్రస్తుత సీజన్ కూడా నిరాశనే మిగల్చడంతో అన్నదాతలు సర్కారు సాయం కోసం కనురెప్ప వాల్చకుండా ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 2023 మార్చి-ఏప్రిల్ మాసాల్లో ఆరు నుంచి ఏడు సార్లు వడగళ్ల బీభత్సం రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. వరి, మామిడి, మొక్కజొన్న, కూరగాయలు, ఇతర పంటలకు తీవ్ర నష్టం జరిగింది. అంతకు ముందు వర్షాభావ పరిస్థితులతో సగం మేర పంట కోల్పోగా.. వడగళ్ల రూపంలో మొత్తానికి మొత్తం తుడుచుకుపెట్టుకు పోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వారం రోజుల వ్యవధిలో వడగళ్లు జిల్లా మొత్తం చుట్టేసాయి. చేతికొచ్చిన పంటలు కోల్పోయిన రైతులు ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగారు. దీంతో స్పందించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు నష్టం అంచనా కోసం సర్వే చేపట్టారు. నీటిలో మునిగిన వరి.. రాలిన గింజలు.. నేల రాలిన మామిడి.. నేలమట్టమైన కూరగాయల తోటలను అధికారులకు చూపిస్తూ... రైతులు గొల్లుమన్నారు. గతేడాది యాసంగి సీజన్‌లో 1.31 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, ఇందులో వరి 1.27 లక్షలు, మొక్కజొన్న, టొబాకో, మిర్చి తదితర పంటలు సాగు చేశారు. సుమారు 12 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలున్నాయి. 2023 మార్చి 18 నుంచి 22వ తేదీ, ఏప్రిల్ నెలలో 22 నుంచి 27 వరకు వడగళ్లు, అకాల వర్షాలు, ఈదురు గాలులు, పెను నష్టం మిగిల్చాయి. దీంతో రైతులకు పెట్టుబడులు పోను... ఇంటింకి పైసా రాని దయనీయ పరిస్థితుల్లో నష్టపోయిన ప్రతీ ఎకరా వరికి రూ.10వేల పరిహారం ఇస్తామని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది.

36,697 ఎకరాల్లో..

గత ఏడాది మార్చి మూడో వారంలో మొదటి సారి వడగళ్లతో 4, 443 ఎకరాల్లో వరి పంట దెబ్బతినగా, ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం చొప్పున ప్రభుత్వం రూ.4.44 కోట్లు రిలీజ్ చేసి, బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఆ తర్వాత మార్చి-ఏప్రిల్ నెలల్లో కురిసిన వడగళ్లలో 12 మండలాల పరిధిలో 20,160 మంది రైతులకు చెందిన 36,697 ఎకరాల్లో వరి, మామిడి ఇతర పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ నివేదికలను గత సర్కారుకు పంపించింది. ఈ మేరకు ప్రభుత్వం నష్టపరిహారం సొమ్ము రూ.36.69 కోట్లు రిలీజ్ కాగా, వ్యవసాయ శాఖ అధికారులు సైతం వెల్లడించారు. డబ్బులు ట్రెజరీకి చేరుకున్నాయని ప్రకటన చేశారే తప్ప.. రైతుల ఖాతాల్లో జమ చేయడంలో ఆలస్యం చేశారు. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడం... 2023 యాసంగి పంట నష్టపరిహారం అటకెక్కింది.

పంట నష్టం వివరాలు

మండలం	రైతులు	నష్టం (ఎకరాల్లో)	పరిహారం (రూ.కోట్లలో)
జనగామ	4,909	9,107	9.10
బచ్చన్నపేట	5,890	13,880	13.88
లింగాలఘణపురం	305	431.36	4.31
నర్మెట	5,026	8,565	8.56
తరిగొప్పుల	726	1,013	1.01
రఘునాథపల్లి	2,279	2,628	2.62
కొడకండ్ల	288	291	29.18లక్షలు
దేవరుప్పుల	10	12	1.20లక్షలు
పాలకుర్తి	51	88.33	88.82లక్షలు
స్టేషన్‌ఘన్‌పూర్	234	233.22	23.35లక్షలు
చిల్పూరు	441	440.24	44.06లక్షలు
జఫర్‌గఢ్	01	2.2	25వేలు

నష్టపరిహారం అందలేదు..



గతేడాది ఏప్రిల్ మాసంలో కురిసిన వడగళ్లతో ఐదు ఎకరాల్లో సాగు చేసిన కోతకు వచ్చిన వరి పంట నీటిపాలైంది. వ్యవసాయ శాఖ అధికారులు ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామని తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ఏడాది గడిచి పోతున్నా..పైసా రాలేదు.

-నల్ల సత్తిరెడ్డి, బండ నాగారం, బచ్చన్నపేట

మూడు ఎకరాల్లో నష్టపోయా..



గతేడాది యాసంగి సీజన్‌లో మూడు ఎకరాల్లో వరి సాగు చేసిన. పెట్టుబడుల కోసం రూ. లక్ష వరకు ఖర్చు చేసిన. రెండు రోజుల్లో పంట కోసేందుకు సిద్ధం చేసుకుంటున్న సమయంలో వడగళ్లు, గాలిదుమారంతో వందశాతం పంట కోల్పోయాను. 13 నెలలు గడిచి పోతున్నా నష్టపరిహారం రాలేదు.

- మందపురం ఎల్లగౌడ్, ఇప్పగూడెం

జాబితాలో పేరు నమోదు చేశారు...



పోచన్నపేటలో ఏడు ఎకరాల్లో మామిడి తోట సాగు చేస్తున్నా. గత ఏడాది అకాల వర్షాలు, వడగళ్లతో చెట్టుకు కాయలు లేకుండా రాలి పోయాయి. అధికారులు పరిహారం జాబితాలో పేరు నమోదు చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు.

- కె.రవీందర్‌రెడ్డి, పోచన్నపేట, బచ్చన్నపేట

జనగామ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా



జనగామ రూరల్: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ..



చిరస్మరణీయుడు అంబేడ్కర్

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్/జనగామ: దేశం గర్వించే వ్యక్తి రాజ్యాంగానికి ప్రాణపదం చేసిన చిరస్మరణీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా నేడు దేశం పాలించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి దయానందరాణి, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీఏఓ వినోద్‌కుమార్, కార్మికాధికారి కుమారస్వామి, సుగుణాకర్‌రాజు, వెంకటేశ్వర్లు, మధు, అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరుషి, పీపీ స్టీవెన్, ఎన్.సిద్దులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ చౌరస్తాలోని మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

వల్మిడిలో కొనసాగుతున్న పూజలు



విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాలకుర్తి టౌన్: వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాచంద్రస్వామి వారికి ప్రబంధ సేవాకాలం, నివేదన, తీర్థగోష్టి మహా వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆదివారం రాత్రి విద్యుత్ దీపాల వెలుగుతో ఆకట్టుకుంది.

నయవంచనకు పేటెంట్ ‘కడియం’

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రఘునాథపల్లి: ఎన్నికలకు కావాల్సినవి అన్ని తీసుకుని.. కేసీఆర్‌ను నమ్మించి మోసం చేసిన కడియం శ్రీహరి నయవంచనకు పేటెంట్‌గా మారాడని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. రాజయ్యను పార్టీలోకి తీసుకువస్తామని, త్వరలో ఎన్నికల ప్రచారం చేస్తాడన్నారు. కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలన్నారు. ఏ కష్టమెచ్చినా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. కడియం కావ్యను చిత్తుగా ఓడించాలని కోరారు. ఈ నెల 16న మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో పార్టీ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ సమక్షంలో జరిగే నియోజకవర్గ సమావేశానికి ప్రతీ గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు వారాల రమేష్, ఎంపీటీసీ శాగ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీకి కొనాల్సిందే..

- రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు
- ట్రేడర్లు సైతం కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందే..
- రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ (ఏఎంసీ)లో చోటు చేసుకున్న ఘటన పునరా వృతం కాకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పర్యవేక్షణలో ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర (ఎంఎస్‌పీ) వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం క్వింటాల్‌కు తక్కువ ధరకు కొనుగోలు చేశారని ఏసీ ఆదేశాల మేరకు ముగ్గురు ట్రేడర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి భాస్కర్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆగ్రహించిన ట్రేడర్లు ఏఎంసీలో ప్రైవేట్ కొనుగోళ్లను నిలిపి వేయడంతో నాలుగు రోజులుగా సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే మార్కెట్‌లో ప్రైవేట్‌గా 15 వేల బస్తాలకు పైగా కొనుగోలుకు సిద్ధంగా ఉండగా, సుమారు వెయ్యి బస్తాల వరకు మక్కలు ఉన్నాయి. ట్రేడర్లతో అధికారులు జరిపిన చర్చలు విఫలం కాగా... నేటి(సోమవారం) నుంచి మార్కెట్ పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

మూడు జోన్లుగా మార్కెట్..

మార్కెట్‌లో ట్రేడర్లు ప్రైవేట్ వ్యాపారం బంద్ చేయడంతో ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మార్కెట్‌లో పీఏసీఎస్, ఐకేపీ ప్రభుత్వ సెంటర్‌ను ఏర్పాటు చేయగా... చీటకోడూరు రోడ్డు సమీపంలో ప్రారంభించిన పీఏసీఎస్ సెంటర్‌ను సైతం ఇక్కడకు షిఫ్ట్ చేశారు. జనగామ ఆర్డీఓ కొమురయ్యకు ఓవరాల్ పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించగా.. తహసీల్దార్ వెంకన్న నేతృత్వంలో మూడు సెంటర్లకు ముగ్గురు నాయబ్ తహసీల్దార్లను నియమించారు. మార్కెట్ పరిధిలో ఏర్పాటు చేసిన మూడు ప్రభుత్వ సెంటర్ల ద్వారా యాసంగి సీజన్‌లో వచ్చే చివరి గింజ వరకు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నారు. కాగా మార్కెట్‌కు వచ్చే మొక్కజొన్న, చింతపండు ఇతర అపరాల సరుకులను ట్రేడర్లు కొనుగోలు చేసేలా అధికారులు వారితో మరోమారు చర్చించనున్నారు.

ఎంఎస్‌పీకి కొనుగోలు చేయాలి



మార్కెట్‌లో ఎవరైనా సరే ధాన్యం ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు కొనాల్సిందే. ట్రేడర్లు ప్రైవేట్‌గా కొనుగోలు నిలిపి వేయడంతో మార్కెట్ పరిధిలో రెండు పీఏసీఎస్, ఒక ఐకేపీ ధాన్యం సెంటర్లను ఏర్పాటు చేశాం. వీటిని మూడు జోన్లుగా విభజించి, ఆర్డీఓ పర్యవేక్షణలో కొనుగోళ్లు సజావుగా సాగేలా ఆదేశాలు జారీ చేశాం. రైతులు సరుకులను తేమశాతం చూసుకుని తీసుకువస్తే మంచిది.

- రోహిత్‌సింగ్, రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్, జనగామ

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, కొనుగోలుతో పాటు వసతులను ఆర్డీఓ వెంకన్న అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. రైతుల వద్ద నుంచి కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో రైతులు వడదెబ్బ బారిన పడకుండా తగిన వసతులు కల్పించాలన్నారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలన్నారు. తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజనేయులు, ఆర్ఐ అనిల్‌బాబు, ఐకేపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

‘పార్లమెంట్’ ప్రతిష్టాత్మకం

- అన్ని పార్టీల నేతలకు గెలుపే లక్ష్యం..
- ఎత్తులు.. పైఎత్తులతో వ్యూహాల రచన
- ఎన్నికల ఇన్‌చార్జ్‌లను నియమించిన బీజేపీ, కాంగ్రెస్
- బాలారిష్టాల్లో భారత రాష్ట్ర సమితి..



సాక్షిప్రతినిధి, వరంగల్ : త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఆయా పార్టీల ముఖ్య నాయకులు గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మక సమీకరణలపై దృష్టి సారించారు. పాత కొత్త లేకుండా కలిసొచ్చే నాయకులు, కార్యకర్తలను కలుపుకొనిపోయేందుకు సన్నద్ధమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల కీలక నామినేషన్ల ఘట్టం ఈనెల 18న నోటిఫికేషన్‌తో మొదలు కానుంది. ఈ నేపథ్యంలో పార్టీల నాయకత్వం కేడర్‌ను అప్రమత్తం చేస్తున్నది. వరంగల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటు బ్యాంకును బేరీజు వేసుకుంటూ లోక్‌సభ ఎన్నికలకు అస్త్రశస్త్రాలతో నేతలు సమాయత్తం అవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలకు బీజేపీ, కాంగ్రెస్ ఇప్పటికే సీనియర్ నాయకులకు ఎన్నికల ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు అప్పగించాయి. ఊహించని పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడిప్పుడే బాలారిష్టాలను అధిగమిస్తోంది.

అన్ని పార్టీలకు ఎన్నికల ఇన్‌చార్జ్‌లు

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ మరో మూడు రోజుల్లో విడుదల కానున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు బీజేపీ, టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల ఇన్‌చార్జ్‌లపై భారం పెడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కాగానే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను నియమించింది. బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు ఇప్పటికే మూడు కీలక భేటీలు, పదాధికారులతో సమావేశాలు నిర్వహించారు. గులాబీ దళపతి కేసీఆర్ మహబూబాబాద్ ఎంపీ సీటును సిట్టింగ్‌కు, వరంగల్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించిన నేపథ్యంలో కావ్య, ఆమె తండ్రి కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరారు. కావ్యకు కాంగ్రెస్ టికెట్ ఇప్పించుకోవడంతో హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారపల్లి సుధీర్‌కుమార్‌ను రెండు రోజుల క్రితం వరంగల్ అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్ఎస్ మళ్లీ ప్యాచప్ చేస్తోంది. రెండు పార్లమెంట్ స్థానాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు. ఆయా నేతలతో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య తదితరులతో కేసీఆర్ ఈ మేరకు భేటీ అయ్యారు. ఇక కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మంత్రులు సురేఖ, సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులను సమన్వయం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ ముఖ్య నేతలు, నాయకులతో కలిసి ఇప్పటికే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో తిరుగుతున్నారు.

ప్రచారంలో ఏకతాటిపైకి తెచ్చేలా..

వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు మూడు పార్టీల అభ్యర్థులు ఖరారు కాగా.. గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం నియోజకవర్గాల్లో నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గ పోరు సమస్యను సరిచేసి ప్రచారంలో అందరినీ ఏకతాటిపైకి తెచ్చేలా పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. పార్టీలు మారినవారు పోను ఉన్న వారిని కలుపుకొని ముందుకెళ్తున్నారు. ఇదిలా ఉంటే స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరడంతో వరంగల్ లోక్‌సభ స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అందరూ కాంగ్రెస్ శాసనసభ్యులే ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషించడంతోపాటు పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్లను రాబట్టుకునే వ్యూహంలో అన్ని పార్టీలు తలమునకలై ఉన్నాయి.

నేడు మంత్రుల రాక

పాలకుర్తి టౌన్: పాలకుర్తిలో నేడు నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశానికి ఇద్దరు మంత్రులు రానున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్‌లో నిర్వహించనున్న సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు, నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, పార్టీశ్రేణులు హాజరు కావాలని కోరారు.

గడ్డం జలేందర్‌కు జాతీయ పురస్కారం



అవార్డు అందుకుంటున్న జలేందర్

పాలకుర్తి: పాలకుర్తి మండలం దర్దేపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం జలేందర్‌కు జాతీయ పురస్కారం వరించింది. ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో ఉగాది మహానంది జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ప్రముఖ సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ అవార్డు రావడంతో జలేందర్‌ను పలువురు అభినందించారు.

నీరుకుళ్లలో పునుగు పిల్లి


క్యాన్‌లో దాక్కున్న పునుగు పిల్లి

ఆత్మకూరు : అరుదుగా కనిపించే పునుగు పిల్లి మండలంలోని నీరుకుళ్లలో ప్రత్యక్షమైంది. శనివారం రాత్రి గ్రామానికి చెందిన పంచనేని రాజేశ్వర్‌రావు ఇంటి పరిసరాల్లోకి వచ్చి ఓ క్యాన్‌లోకి వెళ్లింది. దానిని కాపాడిన రాజేశ్వర్‌రావు.. ఆదివారం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా, హనుమకొండలోని జూపార్క్ సిబ్బంది.. నీరుకుళ్లలోని రాజేశ్వర్‌రావు ఇంటికి చేరుకుని పునుగు పిల్లిని తీసుకెళ్లారు. గతంలో కూడా నీరుకుళ్లలో పునుగు పిల్లి ప్రత్యక్షమైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ పిల్లి ఎక్కడి నుంచి వచ్చింది అనే అంశం చర్చనీయాంశమైంది.

పోలీసుల ప్రత్యేక తనిఖీలు

- 25 వాహనాల స్వాధీనం..జరిమానాలు


కాజీపేట చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సుధాకర్ రెడ్డి

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో ఆదివారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాలకు భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను బిగించుకుని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వాహనదారులపై జరిమానాలు విధించారు. సైలెన్సర్లను తొలగించి వాహనదారుల సొంత ఖర్చులతో కొత్తవి బిగింపజేశారు. సీఐ సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్సైలు శివకృష్ణ, లవన్ కుమార్, నవీన్‌కుమార్‌లు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టడంతోపాటు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సైలెన్సర్ మార్చి.. న్యూసెన్స్

- యువకుడిపై కేసు నమోదు

హసన్‌పర్తి: బైక్ సైలెన్సర్ మార్చి.. న్యూసెన్స్ చేస్తున్న ఓ యువకుడిపై ఆదివారం కేసు నమోదైంది. పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన విజయ్ తేజారెడ్డి తన బైక్‌కు సైలెన్సర్, హారన్ మార్చి శబ్ద కాలుష్యం చేస్తూ కరీంనగర్ నుంచి హనుమకొండ వైపునకు ర్యాష్ డ్రైవింగ్‌తో వస్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు భీమారం వద్ద ఆపారు. వాహనం సైలెన్సర్, హారన్ మార్చినట్లు గుర్తించారు. ఈ మేరకు బైక్‌ను సీజ్ కేసి.. విజయ్‌తేజారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

అర్ధరాత్రి పీఎస్ తనిఖీ


ఇంతేజార్‌గంజ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ

రామన్నపేట: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం అర్ధరాత్రి ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ బారీ ఆధ్వర్యంలో.. రాత్రి పూట సైలెన్సర్ శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఐదు వాహనాల్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

విద్యతోనే విజ్ఞానం, వికాసం

- ప్రపంచతత్వవేత్తల్లో అంబేడ్కర్ ఒకరు
- కేయూ వీసీ తాటికొండ రమేష్


కేయూ దూరవిద్య కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ


కాజీపేట అర్బన్: నిట్‌లో..

కేయూ క్యాంపస్: విద్యతోనే విజ్ఞానం, వికాసమని, ప్రపంచ తత్వవేత్తల్లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేడ్కర్ ఒకరని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. ఆదివారం కేయూలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ బాల్యం నుంచే వివక్షతకు గురయ్యారన్నారు. ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొని విద్యద్వారానే ఉన్నత స్థితిలోకి వచ్చిన అంబేడ్కర్ సేవలను నేటి యువత గుర్తుంచుకోవాలన్నారు. కేయూ దూరవిద్యాకేంద్రం మాజీ డైరెక్టర్ ఎం ఎర్రగట్టుస్వామి 'అంబేడ్కర్ థీయరీ ప్రాక్టీసెస్' అనే అంశంపై కీలకపోన్యాసం చేస్తూ సామాజిక రుగ్మతులు పాలద్రోలేందుకు అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి ,అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్, ఆచార్యులు కృష్ణమాచార్య, సీహెచ్ సమ్మయ్య మాట్లాడారు. కాగా, కాకతీయ యూనివర్సిటీలో 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు డాక్టరేట్ పొందిన పరిశోధకులను అతిథులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేడ్కర్


హన్మకొండ: అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఎండీ

హన్మకొండ: సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమాజం దిశగా భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లిన బహుముఖ ప్రజ్ఞాశాలి భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి సీఎండీ వరుణ్ రెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ముందు చూపుతో ఆలోచించి ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా రాజ్యాంగంలో సమాన హక్కులు పొందుపరిచిన తాత్వికవేత్త అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లు బి.అశోక్ కుమార్, వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, కంపెనీ సెక్రటరీ కె. వెంకటేశం, సీజీఎంలు సి.ప్రభాకర్, కిషన్, రాజుచౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

కాజీపేట అర్బన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుది అన్నారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, నిట్ డీన్స్, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం వరంగల్ నగరం, హనుమకొండ జిల్లాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.




అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ


బల్దియాలో పూలమాల వేస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే..



ఆర్టీసీ హనుమకొండ డిపోలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఎం ధరం సింగ్, ఉద్యోగులు, ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో జయంతి వేడుకలు ప్రారంభిస్తున్న ఆర్ఎం జ్యోతి శ్రీలత

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహబూబాబాద్ జిల్లా గూడూరులో వ్యక్తి, వరంగల్ జిల్లా నర్సంపేటలో యువకుడు, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఫతేషాపూర్‌లో వ్యక్తి ఉరివేసుకుని బలవన్మరణం చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.


వెంకటేశ్ మృతదేహం

గూడూరు: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం గూడూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొంత వెంకటేశ్ (35) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఇసుక వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. వ్యాపారం కోసం, ట్రాక్టర్ కొనడానికి అప్పు చేశాడు. వ్యాపారం కలిసి రాక అప్పు పెరిగింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్.. హైదరాబాద్ నుంచి గూడూరుకు చేరుకున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అప్పుల బాధతో ఉరి వేసుకొని చనిపోతున్నా అని కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు కుమారుడు మృతి చెందడం చూసి బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉంది.

నర్సంపేటలో యువకుడు..


వెంకటేశ్వర్లు (ఫైల్)

నర్సంపేట రూరల్ : అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నర్సంపేటలో చోటు చేసుకుంది. టౌన్ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన సంపంగి వెంకటేశ్వర్లు (30) సర్వాపురంలో సిమెంట్ బ్రిక్స్ తయారీ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే కొంతకాలంగా అప్పులు అయ్యాయని కుటుంబ సభ్యులతో చెప్పి తరచూ మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన తల్లి విజయమ్మ.. ఇంట్లోకి వెళ్లి చూడగా వెంకటేశ్వర్లు ఉరివేసుకుని కనిపించాడు. దీంతో కేకలు వేయగా స్థానికులు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లావణ్య ఉంది. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫతేషాపూర్‌లో కుటుంబ కలహాలతో వ్యక్తి..

రఘునాథపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఫతేషాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ అఫ్జల్ (59)కు భార్య, కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి దంపతులు మధ్య కలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అఫ్జల్.. శనివారం నిడిగొండ అన్నంకుంట వద్ద పురుగుల మందు తాగాడు. తాను చనిపోతున్నట్లు అల్లుడికి ఫోన్‌చేసి తెలిపాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని అఫ్జల్‌ను వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

- రెడ్డిపురం కుంటలో ఘటన


వాజీద్ మృతదేహం

హసన్‌పర్తి: స్నేహితులతో కలిసి కుంటలో ఈతకు వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం కేయూ పీఎస్ పరిధిలోని రెడ్డిపురంకుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ రాయపుర ప్రాంతానికి చెందిన ఎండీ వాజీద్(22)తో పాటు మరో ముగ్గురు యువకులు రెడ్డిపురం కుంటలోకి ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో వాజీద్ ఈతకొడుతూ కుంటలో మునిగాడు. ఆందోళనకు గురైన స్నేహితులు ఈ విషయాన్ని పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. బోటు సాయంతో మృతదేహాన్ని వెలికితీసి కేయూ పోలీసులకు అప్పగించినట్లు హనుకొండ ఎస్ఎఫ్ఓ నాగరాజు, వరంగల్ ఎస్ఎఫ్ఓ రవీందర్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

నానమ్మను చంపిన మనవడు

జఫర్‌గఢ్: అత్త, కోడలి మధ్య జరిగిన గొడవతో ఆగ్రహానికి గురైన మనవడు.. నానమ్మను కత్తితో పొడిచి చంపాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని ఉప్పుగల్లులో జరిగింది. ఎస్సై శీలం రవియాదవ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మామిండ్ల ఎల్లమ్మ (65), తన కోడలు రజిత మధ్య కుటుంబ సమస్యల కారణంగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన మనవడు.. కత్తితో నానమ్మను పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఎల్లమ్మ స్పృహతప్పి పడింది. ఇది గమనించిన కుటుంబీకులు ఎల్లమ్మను వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా,ఈ ఘటనపై మృతురాలి భర్త ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

సర్వే పేరుతో మోసం..!

- ఉచిత కరెంట్ బిల్లు లాగిన్ అంటూ డబ్బు దండుకుంటున్న నకిలీ అధికారి..
- పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు


శంభునిపేటలో నకిలీ సర్వే చేసిన వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

ఖిలా వరంగల్: సర్వే పేరుతో ఓ నకిలీ అధికారి వరంగల్ రైల్వేగేట్ స్లమ్ ఏరియాలో పర్యటిస్తున్నాడు. అమాయక ప్రజలను నమ్మించి అందిన కాడికి దుండుకుంటున్నాడు. ఈ దందా ఆదివారం శంభునిపేటలో వెలుగులోకి వచ్చింది. వరంగల్ శంభునిపేటలో సర్వే అధికారి వేషధారణతో ఓటర్ లిస్ట్ చేతపట్టి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో దేనికైనా దరఖాస్తు చేశారా..? చేస్తే జీరో కరెంట్ బిల్లు మీకు వస్తుందా..? పెన్షన్ కోసం దరఖాస్తు చేశారా..?గ్యాస్ సబ్సిడీ మీ అకౌంట్‌లో జమ అయ్యిందా..? అంటూ స్థానికులను కలిసి పలు ప్రశ్నలు వేస్తున్నాడు. ఈ క్రమంలో మీకు జీరో కరెంట్ బిల్లు రాలేదా..?అయితే నేను నమోదు చేస్తానంటూ అమాయకులను నమ్మించి ఆధార్, కరెంట్ బిల్లు తీసుకుని ఓటీపీ మీ మొబైల్‌కు వచ్చింది చెప్పండంటూ వచ్చిన ఓటీపీ చెప్పిన వెంటనే యువర్ ఆధార్ అప్‌డేట్ (సక్సెస్ ఫుల్) అని రాగానే దీనినే చూపించి రూ.100 నుంచి రూ.200 వరకు లాగేస్తున్నాడు. ఈ నయా దందా వారం రోజుల నుంచి కొనసాగుతున్నట్లు తెలిసింది. అతడిపై అనుమానం చెందిన స్థానికులు వెంటనే స్థానిక కాంగ్రెస్ నేతలు షేక్ మునీర్, ఎండీ జమీల్, మంద సన్నీకి సమాచారం అందజేశారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని ఏ అంశంపై సర్వే చేస్తున్నావో స్పష్టంగా చెప్పాలని నకిలీ సర్వే అధికారిని నిలదీశారు. సరైన సమాధానం రాకపోవడంతో పట్టుకుని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు స్థానిక కాంగ్రెస్ నేతలు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


రాకేష్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పర్వతగిరి: ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పర్వతగిరి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని సోమారం క్రాస్ వద్ద ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సన్నిరెడ్డి రాకేష్.. పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించాడు. వెంటనే అదుపులోకి తీసుకుని బ్యాగును తనిఖీ చేయగా రూ.54వేల 750 విలువైన రెండు కిలోల 190గ్రాముల ఎండు గంజాయి లభించగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విచారించగా కరీంనగర్‌కు చెందిన దమ్మాని నవీన్ అనే వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు రాకేష్ ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జి.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును. గజం కేవలం 15,000/- మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264880]

SERVICES

■ వరంగల్ నగరమందు పర్మిషన్‌తో కూడిన ప్లాట్లు & ఇండ్లు దొరుకును. నిరుద్యోగులకు గొప్ప అవకాశం కెనడా, ఆస్ట్రేలియా, వర్క్ వీసా Helping Hand Seva Society ద్వారా ఉద్యోగం చేస్తూ EMI పద్ధతిలో చెల్లించవచ్చు. ఫోన్: 9014743326. [W-1264930]

CHANGE OF NAME

■ I, MOHAMMED IMRAN ALI, S/o. Mazer Ali, Age: 48 yrs, Occu: Business, R/o. H.No.1-7-289/6, Revenue Colony, Subedari, Hanamkonda District - 506001, Telangana State, India on behalf of my Minor daughter Maira Mohammed Imran (Old Name) Age: 16 yrs (Minor) have changed my minor daughter name MAIRA IMRAN (New Name). [W-1264884]

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్‌కేర్ సర్వీస్ 24 గం॥ 12 గం॥ వృద్ధులను, పెద్ద వారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. 8186926067, 8977263124. [W-1264881]

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్ ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు. ✆ 89208 66865. [T-1252729]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED

■ ఆర్గానిక్ స్టోర్‌లో పని చేయుటకు ఆడవారు కావలెను. చదువు అవసరం లేదు. వయస్సు 35 సం॥ నుండి 50 సం॥ వరకు. సంప్ర॥ మామునూర్ క్యాంపు. సెల్: 9959975382. [W-1264929]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph:9160900024/9640400073 [H-799868]

■ Hydలోని పేషెంట్లను, ముసలివారిని, వారి ఇంటి వద్దనే చూసుకొనుటకు ఆయాలు, వార్డ్ బాయ్స్, నర్సులు, కేర్‌టేకర్స్ కా॥. జీ : 10-25 వేలు. రూం + భో॥ ఫ్రీ. Ph: 9000638842, 9866605144 [HA-13644]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185032]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పరకాల కాంగ్రెస్‌లో వర్గపోరు


గొడవ పడుతున్న కొండా, రేవూరి వర్గీయులు


కొండా వర్గీయులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

- కొండా, రేవూరి వర్గాల మధ్య ఘర్షణ
- ప్రాధాన్యం దక్కడం లేదని కొండా వర్గీయుల ఆందోళన
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రధాన రహదారిపై బైఠాయింపు

పరకాల: పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో కాంగ్రెస్ వర్గపోరు బట్టబయలైంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో రేవూరి, కొండా వర్గీయుల మధ్య జరిగిన గొడవతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులంతా సమావేశానికి హాజరై మాట్లాడుతున్న సమయంలో కొండ వర్గీయులు(గజ్జి విష్ణు, ఆయన అనుచరులు).. 'జిల్లా టైగర్ కొండా మురళి.. కొండా మురళి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేస్తూ వేదిక వద్దకు దూసుకొస్తున్న తరుణంలో అక్కడే ఉన్న మిగతా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే వేదికపై నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో మొదటి నుంచి కష్టపడుతున్న వారికి ప్రథమ ప్రాధాన్యత.. ఎన్నికల ముందు చేరి తన గెలుపు కోసం కృషిచేసిన వారికి రెండో ప్రాధాన్యత.. ఎన్నికల తర్వాత గెలిచిన వారికి మూడో ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. అయితే అప్పటికే గొడవ పడుతున్న ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుని ఒకరిపై ఒకరు పడిపోయి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కావాలని గొడవలు సృష్టిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకుని కొండా వర్గీయుడైన గజ్జి విష్ణుతో పాటు అనుచరులను అదుపులోకి తీసుకున్నాక నేతల ప్రసంగాలు కొనసాగాయి.

గజ్జి విష్ణు అనుచరుల ధర్నా

పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై కొండా మురళి అనుచరులు గజ్జి విష్ణు తదితరులు పరకాల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. సీఐ రవిరాజ్ చేరుకుని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ధర్నాలకు అనుమతి లేదని అడ్డుకున్నారు. హెచ్చరికలను పట్టించుకోకుంటూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనడంతో ఆందోళన విరమించారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం..


స్వర్ణోత్సవ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలి జెడ్పీహెచ్‌ఎస్ 1973–74 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవ (50 సంవత్సరాల) సంబురాలు నిర్వహించారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ నాటి స్మృతులు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గ్లోబల్ పీస్ అవార్డు విజేత, ఆసియా ఖండం తెలుగు అధ్యక్షుడు మంతెన దామోదరాచారి, గురువులు అనంతారెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తమాచారి, బండి సాంబయ్య, ఎల్లారెడ్డి, లాయర్ అనసూర్య, మాధవరెడ్డి, సూర్యనారాయణ, సారంగపాణి, సదాశివుడు, వీరమల్లు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

- గుండ్రాతి మడుగు వాసికి తీవ్రగాయాలు
- టెక్సాస్‌కు వెళ్లిన తల్లిదండ్రులు

కురవి/ వరంగల్ క్రైం: అమెరికాలోని టెక్సాస్‌లో శనివారం రాత్రి (భారతీయ కాలమాన ప్రకారం) జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి)కు చెందిన బండి రోహిత్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బండి అనిల్‌రెడ్డి, అనితారెడ్డి దంపతులు సుమారు 20 సంవత్సరాల నుంచి హనుమకొండలోని సహకారనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రోహిత్‌రెడ్డి టెక్సాస్‌లో అమెజాన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు రోహన్‌రెడ్డి కూడా అక్కడే ఎంఎస్ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో రోహిత్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. తీవ్ర గాయాలైన రోహిత్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందడంతో ఆదివారం రాత్రి టెక్సాస్‌కు ప్రయాణమయ్యారు.

పేదింటి బిడ్డకు చేయూత


ఒంటరి బాలికను ఆదుకోరూ!

చిన్నారిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం


చిన్నారితోకలిసి ఇంటిని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

- అనాథ చిన్నారికి రూ.2లక్షలతో ఇంటి నిర్మాణం
- మానవత్వం చాటుకున్న ఎస్‌ఆర్‌ఆర్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి
- 'సాక్షి'లో ప్రచురితమైన 'దీనగాథ'కు స్పందన

సాక్షి స్పందన

రాయపర్తి: పేదింటి బిడ్డకు చేయూత అందింది. తల్లిదండ్రులను కోల్పోయి నిలువనీడలేక ఇబ్బందులు పడుతూ టెంట్‌కిందే జీవనం కొనసాగిస్తున్న చిన్నారిపై 'సాక్షి'లో ప్రచురితమైన 'దీనగాథ' కథనానికి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌ఆర్ సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. ఆ 11 ఏళ్ల చిన్నారికి రూ. 2లక్షలతో ఒక గది(ఇంటి) నిర్మాణంతోపాటు, బాత్రూం, నీటివసతికోసం కుళాయి నిర్మించి అందించి అక్కున చేర్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ఐత యాకయ్య 11 ఏళ్ల క్రితం మృతిచెందాడు. యాకయ్య భార్య కొమురమ్మ కూడా అనారోగ్యంతో రెండు నెలలక్రితం మృతిచెందింది. దీంతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి ఒంటరైంది. కాగా, మట్టిగోడలతో నిర్మించుకున్న ఇల్లు కూలింది. దీంతో ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి ఈ చిన్నారి రేణుకది. ఈ విషయం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో శ్రీనివాస్‌రెడ్డి స్పందించి రూ.2లక్షలతో ఇంటి నిర్మాణం చేపట్టారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ఆ చిన్నారి రేణుకతో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎంతోమందికి మార్గదర్శకంగా నిలుస్తున్న శ్రీనివాస్‌రెడ్డి.. ఈ చిన్నారిని ఆదుకోవడంపై గ్రామస్తులతోపాటు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లేతాకుల మధుకర్‌రెడ్డి, గాదె రవీందర్‌రెడ్డి, గబ్బెట బాబు, ఉల్లెంగుల నర్సయ్య, సుధాకర్‌రెడ్డి, సంది అమ్మిరెడ్డి, యూసుఫ్, గాడిపెల్లి యాకయ్య, ఐత సంపత్, ఐత రాజు తదితరులు పాల్గొన్నారు.